క్లుప్తంగా

సెమీ క్రిస్మస్ వేడుకలు




అమరావతి: స్థానిక బోగందాని చెరువులోని ఎస్టీ కాలనీలో ఆదివారం జీసస్‌క్రాస్ మందిరం సంఘకాపరి కాకుమాను జాన్‌మాథ్యూ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలుత ప్రార్థనలు చేసిన అనంతరం వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి నందూరి కరుణకుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి ఆలా లక్ష్మీనారాయణ, నాయకుడు పలుకూరి రోశిబాబులు కేక్ కట్ చేసి ఎస్టీ కాలనీ వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

పెరియార్ రామస్వామి వర్ధంతి



సత్తెనపల్లి: సంఘసంస్కర్త పెరియార్ రామస్వామి 50వ వర్ధంతి పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పెరియార్ రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకుడు కంటూ వెంకట్రామయ్య మాట్లాడుతూ పెరియార్ హేతువాదం, ఆత్మగౌరవం, మహిళల హక్కులు, కులనిర్మూలన సూత్రాలను ప్రచారం చేశారన్నారు. ఆయన దక్షిణ భారతదేశంలోని బ్రాహ్మణేతర ద్రావిడ ప్రజల దోపిడీ, అణగదొక్కుట చేయడాన్ని వ్యతిరేకించాడన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు గుంజి విజయ్‌కుమార్, కుమ్మరి దస్తగిరి, షేక్ చిన్న షరీఫ్, పిక్కలి రత్తయ్య, మల్ల వెంకటేశ్వర్లు, చింకా అంకమ్మరావు, పిక్కలి శివ, గుంటూరు గోవిందు, కంటూ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీమత్ హనుమత్ వ్రత వేడుకలు



అమరావతి: శ్రీమత్‌హనుమత్ వ్రతాన్ని పరస్కరించుకుని ఆదివారం ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలోని ప్రసన్నాంజనేయస్వామి వారికి ప్రత్యేకపూజలు, ఆకుపూజలు, హనుమాన్‌చాలీసా పారాయణం చేసి వడమాలలు సమర్పించుకున్నారు. తొలుత ఆలయ అర్చకుడు పరుచూరి కేశవచార్యులు స్వామి వారికి పంచామృత స్నపన, సహస్రనామాలతో తమలాపాకులతో పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వేమూరి గోపినాధశర్మ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

కాట్రపాడులో ఉచిత వైద్యశిబిరం



దాచేపల్లి : మండలంలోని కాట్రపాడు గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరంలో డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌తో పాటు మరికొంత మంది వైద్యులు పాల్గొని ప్రజలకు వివిధ రకాల వైద్య సేవలు అందించారు. పలువురు రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. తమ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవ కార్యక్రమాలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ అశోక్‌కుమార్ చెప్పారు. ఈ శిబిరంలో సర్పంచ్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

బాలోత్సవ్‌లో వేల్పూరు విద్యార్థుల ప్రతిభ

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ఆదివారం జరిగిన బాలోత్సవ్ పోటీల్లో పాల్గొని 11 బహుమతులు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం షేక్ మహమ్మద్ సుభాని తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయటానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కోలాటం, మ్యూజిక్, క్విజ్, తదితర పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారన్నారు. విజేతలను పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అభివృద్ధికి ఆనవాలు.. పల్లె వైద్యం

- రూపురేఖలు మారిన వైద్యశాలలు
- పెదకూరపాడులో రూ.8.69కోట్లతో నూతన సీహెచ్‌సీ
- నాడు–నేడు కింద మూడు నూతన పీహెచ్‌సీలు, ఐదు పీహెచ్‌సీల అభివృద్ధి
- 55 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు
- పల్లె ప్రజలకు మెరుగైన వైద్యసేవలు



పెదకూరపాడులో నిర్మాణం పూర్తి కావస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రం

పెదకూరపాడు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నాలుగున్నరేళ్లలో పెదకూరపాడు నియోజకవర్గం విద్య, వైద్య రంగంలో ఎంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది. పెదకూరపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానాలు అభివృద్ధికి ఆనవాలుగా నిలుస్తున్నాయి. పూర్తి పల్లెటూరు వాతావరణం కలిగిన నియోజకవర్గంలో కార్పొరేట్ వైద్య సేవలు అందించే దిశగా అడుగులు పడుతున్నాయి.

రూ.11.89 కోట్లతో సీహెచ్‌సీలు నిర్మాణం

పెదకూరపాడులోని 30 పడకల ఆసుపత్రి గత కొంత కాలంగా శిథిలావస్థకు చేరింది. దీంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా నూతన సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ.8.69 కోట్ల నిధులు మంజూరు చేసింది. నిర్మాణం కూడా పూర్తయి త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. అమరావతి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.3.20 కోట్లతో అభివృద్ధి చేశారు. నిర్మాణాలు పూర్తయ్యాయి. సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

రూ.14.54 కోట్లతో పీహెచ్‌సీల అభివృద్ధి

పెదకూరపాడు నియోజకవర్గంలో ఏళ్ల తరబడి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధికి నోచుకోలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యశాలల దుస్థితిని గమనించి నాడు–నేడు కింద పీహెచ్‌సీలను రూ.14.54 కోట్లతో అభివృద్ధి చేశారు. బెల్లంకొండ, చింతపల్లి, దొడ్లేరు గ్రామాల్లో నూతన పీహెచ్‌సీలకు రూ.9.75 కోట్లతో శంకుస్థాపనలు చేశారు. పనులు జరుగుతున్నాయి. ఇదే విధంగా నియోజకవర్గంలోని అత్తలూరులో రూ.1.80 కోట్లతో, అచ్చంపేటలో రూ.2 కోట్లతో నూతన పీహెచ్‌సీలు నిర్మించారు. కాగా అచ్చంపేట పీహెచ్‌సీని ప్రారంభించారు. పెదకూరపాడు మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలో రూ.30 లక్షలతో, క్రోసూరు పీహెచ్‌సీని రూ.50 లక్షలతో, బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెంలో పీహెచ్‌సీని రూ.19 లక్షలతో నాడు–నేడు కింద అభివృద్ధి చేశారు.



75త్యాళ్ళూరులో అభివృద్ధి చేసిన పీహెచ్‌సీ



అచ్చంపేట మండలంలోని తాళ్ల చెరువులో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్

రూ.9.62 కోట్లతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు

పెదకూరపాడు నియోజకవర్గం వ్యాప్తంగా మొత్తం 55 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు రూ.9.62 కోట్లతో నిర్మించారు. వాటిలో 70శాతం పూర్తయ్యాయి. మిగిలినవి పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి గత ప్రభుత్వం వరకు ఎన్నడూ జరగని అభివృద్ధి వైద్యరంగంలో జరగడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పల్లె ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రావడంతో పట్టణ ప్రాంతాలకు వెళ్లడం లేదు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతోనే..



పెదకూరపాడు నియోజకవర్గంలో ఇంత పెద్ద ఎత్తున్న వైద్య రంగంలో అభివృద్ధి జరిగిందంటే అది సీఎం జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో మాత్రమే. పెదకూరపాడు నియోజకవర్గ కేంద్రంలో 30 పడకల ఆసుపత్రిని రూ.8.69 కోట్లతో నిర్మించాం. అలానే మిగిలిన పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను అభివృద్ధి చేశాం. ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో అభివృద్ధి చేశాం. ప్రతి పేదవాడు సర్కారు దవాఖానాకు వచ్చి ఉచితంగా వైద్యసేవలు పొందుతున్నారు.

–నంబూరు శంకరరావు,
ఎమ్మెల్యే, పెదకూరపాడు

ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది..



నూతన సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తయింది. అందులో సరిపడ సిబ్బంది కూడా పుష్కలంగా ఉన్నారు. త్వరలోనే ప్రారంభిస్తారు. ఇకపై అన్ని ఆధునిక సేవలు అందుబాటులోకి వస్తాయి. పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు సమకూర్చింది.

–డాక్టర్ గుంటూరు రవివర్మ,
పెదకూరపాడు సీహెచ్‌సీ, సూపరింటెండెంట్

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణం సమీపంలో ఉన్న మాచర్ల రోడ్డులోని బృందావనం ధాబా–ఫ్యామిలీ రెస్టారెంట్ దగ్గర ఆదివారం జరిగింది. క్రోసూరు మండలం హస్సనాబాద్ గ్రామానికి చెందిన ఎం.ఆంజనేయులు, తన అత్త మస్తానమ్మ ద్విచక్రవాహనంపై సత్తెనపల్లి వస్తున్నారు. పట్టణంలోని బృందావనం ఫ్యామిలీ రెస్టారెంట్ దగ్గర ద్విచక్రవాహనాన్ని గేదె ఢీ కొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108 ద్వారా క్షతగాత్రులను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

ముప్పాళ్ళ: రబీ సీజన్‌లో భాగంగా అక్టోబర్ 1వ తేదీ తర్వాత సాగు చేసిన పంట వివరాలను తప్పనిసరిగా ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు 80% సబ్సిడీపై 865 క్వింటాళ్ల శనగ విత్తనాలను పంపిణీ చేశామని, విత్తనాలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. అలాగే మిరప, మొక్కజొన్నతో పాటు సాగు చేసిన పంట వివరాలను ఆర్బీకేలోని వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా నమోదు చేపట్టవచ్చన్నారు. ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల సంభవించినప్పుడు అందించే నష్టపరిహారం పొందాలంటే తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేసి ఉండాలన్నారు.

క్రీస్తు రాకకు వేళాయె..

- క్రైస్తవ మందిరాలకు క్రిస్మస్ కాంతులు
- నేడు క్రిస్మస్ పర్వదిన వేడుకలకు చర్చిలు సిద్ధం



బాగ్స్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ న్యూ చర్చి



విద్యుత్ దీపాల వెలుగుల్లో లూథరన్ చర్చి



బాగ్స్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి



విద్యుత్ దీపాలతో అలంకరించిన ఇనిమెట్లలోని తెలుగు బాప్టిస్టు చర్చి



విద్యుత్‌దీపాల నడుమ క్రోసూరులోని ఏఈఎల్ చర్చి

సత్తెనపల్లి: సమస్త మానవాళికి దైవ మార్గం చూపించేందుకు ఏసుక్రీస్తు భూమిపైకి వచ్చి వేల సంవత్సరాలైంది. ఆ మహనీయుని బోధనలు క్రైస్తవాధకులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. పాపుల భారం మోసేందుకు పశువుల పాకలో ఏసుక్రీస్తు జన్మించిన రోజును ఏటా క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పర్వదినంగా జరుపుకుంటున్నారు. సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల పరిధిలోని అన్ని చర్చిలను అందంగా తీర్చిదిద్దారు. ఆధ్యాత్మిక అనుభూతి పొందుతూ ప్రత్యేక ప్రార్థనలతో తరించేందుకు క్రైస్తవ సోదరులు సన్నద్ధమయ్యారు. క్రైస్తవ ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో పట్టణంలోని పురాతన, ప్రసిద్ధి చెందిన కొన్ని ప్రార్థనాలయాల చారిత్రక నేపథ్యం ఇలా..

పట్టణానికే మణిహారం..

లూథరన్‌చర్చి: పట్టణం నడిబొడ్డున గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారి పక్కన 1925లో లూథరన్ చర్చి నిర్మించారు. 15 ఎకరాల విస్తీర్ణంలో బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో హయ్యర్ దొర ఈ చర్చిని నిర్మించారు. చర్చి ఆవరణలో విశాలమైన స్థలం ఉండటంతో ప్రతి ఏటా క్రీస్తు సువార్తలు బోధిస్తుంటారు. ఒకేసారి 2 వేల మందికిపైగా చర్చిలో ప్రార్థనలు చేయడానికి అవకాశం ఉంది.

దినదినాభివృద్ధి చెందుతూ..

బాప్టిస్టు చర్చి: పట్టణంలోని అతిపురాతన ఆలయాల్లో ఒకటి బాగ్స్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి. స్థానిక శరభయగుప్తా హిందూ ఉన్నత పాఠశాల వద్ద 1849లో రెండు ఎకరాల స్థలంలో బాప్టిస్టు చర్చిని అమెరికాకు చెందిన బాగ్స్ దొర నిర్మించారు. ఆయన నిర్మించడం వల్ల ఈ చర్చికి బాగ్స్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిగా నామకరణం చేశారు. ఇక్కడ మరో నూతన చర్చి నిర్మాణానికి గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఈ చర్చి నిర్మాణం పూర్తయి ప్రార్థనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా ఉంటుంది.

దీనులకు బాసట....

ఆర్సీఎం చర్చి: పట్టణంలోని గుంటూరు రోడ్డులో ప్రధాన రహదారి పక్కన బ్రిటీష్ పాలకులు 1965లో రోమన్ క్యాథలిక్ మిషనరీ వారిచే ఆర్సీఎం చర్చి నిర్మించారు. ఈ చర్చి పరిధిలో ఉన్నత పాఠశాల నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మికతతో పాటు విద్య, వైద్య సేవలను కూడా పట్టణ ప్రజలకు చేరువ చేశారు. క్రిస్మస్ సందర్భంగా ఏటా పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తారు.

విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చిలు

రాజుపాలెం: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని ప్రతీ చర్చినీ రంగు రంగుల విద్యుత్ దీపాలతో కన్నులు మిరుమిట్లు గొలిపే విధంగా అలంకరించారు. క్రీస్తు జన్మదినం పురస్కరించుకుని క్రైస్తవ సోదరులు ప్రార్థనలు జరుపుకునేందుకు చర్చిలను సుందరంగా తీర్చి దిద్దారు. క్రైస్తవ సోదరులకు ఇది పవిత్రమైన పండుగ.

విద్యుత్ దీపాలతో చర్చిలు..

క్రోసూరు: ప్రపంచంలో క్రైస్తవ కుటుంబాలన్నీ ఎంతో ఘనంగా నిర్వహించుకునే క్రిస్మస్ పండుగ మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రార్థనా మందిరాలు, చర్చిలు విద్యుత్ దీపాలతో శోభాయమానంగా వెలుగుతున్నాయి. క్రిస్మస్ మాసం ప్రారంభం నుంచి గ్రామాల్లో క్రైస్తవ కాలనీల్లో స్టార్‌లు ఏర్పాటు చేసి, సెమీక్రిస్మస్‌లు జరుపుకున్నారు. సోమవారం ఏసు జననాన్ని స్వాగతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని క్రోసూరులోని ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి విద్యుత్ దీపాలతో శోభాయమానంగా విరాజిల్లుంది. పాస్టర్లు, ఫాదర్లు ఏసుక్రీస్తు భూలోకంలో జన్మించటాన్ని స్వాగతిస్తు అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు

నకరికల్లు: మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు క్రైస్తవసోదరులు సిద్ధమయ్యారు. ఆయా గ్రామాల్లోని చర్చిలను రంగులతో, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ ప్రత్యేకప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. స్థానిక ఫాతిమామాత చర్చితో పాటు చల్లగుండ్ల, గుండ్లపల్లి, కండ్లకుంట, దేచవరం, చేజర్ల, కుంకలగుంట, శాంతినగర్ గ్రామాల్లోని చర్చిలను ముస్తాబు చేశారు. పలువురు దాతలు స్వచ్ఛందంగా పేదలకు దుస్తులు, నిత్యావసరాలు, స్వీట్లు పంపిణీ చేశారు. వేడుకల్లో భాగంగా క్రిస్మస్‌రోజు సాయంత్రం ప్రత్యేకంగా నిర్వహించే తేరు ఉత్సవం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చర్చిల నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, ఎన్నారై భవనం సుభాష్‌చంద్రబోస్‌రెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు క్రైస్తవసోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు తాళ్లచెరువులో బాలఏసు తిరునాళ్ల మహోత్సవం

అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువులో నూరు సంవత్సరాల చరిత్ర గల బాలఏసు దేవాలయ తిరునాళ్ల మహోత్సవాలు సోమవారం నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు చేశారు. ఇంగ్లండ్‌కు చెందిన స్వామి అర్లానంద 1892లో తాళ్లచెరువు గ్రామాన్ని నిర్మించారు. ఈ ప్రాంతంలో నివసించేవారికి క్రైస్తవ మత విశిష్టతను తెలియజేసి మత ప్రబోధం చేశారు. 1950లో గ్రామం నడిబొడ్డులో బాలఏసు మందిరాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా డిసెంబర్ 25న వచ్చే క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని బాలఏసు తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

ప్రత్యేక ప్రార్థనలు

ఈ సందర్భంగా 25న ఉదయం 9గంటలకు గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలతో వేడుకలు ప్రారంభమవుతాయి. విచారణ గురువులు పుట్టి అంతోనిరాజు, సహాయ విచారణ గురువులు కఠారి కిరణ్, ఫాదర్ పాతిమామర్రెడ్డిలచే బైబిల్ పఠన, దివ్యబలిపూజలు, వాహన పూజలు నిర్వహిస్తారు. తాళ్లచెరువు గ్రామ సృష్టికర్త స్వామి అర్లానంద విగ్రహానికి నివాళులర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



విద్యుత్‌కాంతులతో బాలఏసు దేవాలయం

రాత్రి 10 గంటల నుంచి బాణసంచాతో తాళ్లచెరువు గ్రామ వీధులలో బాలఏసు తేరు(రథం) ఊరేగింపు కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రికెట్, వాలీబాల్ తదితర ఆటల పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

ఉదయం 11 గంటలకు బాలఏసు మందిర ఆవరణలో కోలాట ప్రదర్శనలు జరుగనున్నాయి. సెయింట్ ఆన్స్ సిస్టర్స్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. పురుషులకు, మహిళలకు కూడా వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపడతారు.

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా..

సత్తెనపల్లి అంబేడ్కర్ నగర్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం

సత్తెనపల్లి: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని 31వ వార్డు మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తి పెంచేలా క్రికెట్ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలను నిర్వహించనుందని, ప్రతి క్రీడాకారుడు క్రీడల్లో మెలకువలను తెలుసుకొని ముందుకు వెళ్లాలన్నారు. క్రీడల వలన పోటీతత్వం పెరుగుతుందన్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలుగు తీయడమే లక్ష్యంగా పోటీలను నిర్వహించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల హనుమంతరావు, నిజాంపట్నం అమరేంద్రలు మాట్లాడారు. ముందుగా పెండెం బాబురావు బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

ఎంపీపీ చన్నపరెడ్డి పద్మావెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మావెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని మాచాయపాలెం గ్రామంలో ఆదివారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలసి ఇంటింటికీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కాలంలో చేసిన మంచిని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేద ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందాలన్నా, అవినీతి రహిత పాలన సాగించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రావాలన్నారు. కులాలు, మతాలు, రాజకీయాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ రామనబోయిన ఆదిగోపాలరావు, చింతారెడ్డి సాయిరెడ్డి, గ్రామ నాయకులు భూపాల్‌రెడ్డి, కొండెబోయిన శ్రీను, నందిపాటి నారాయణరెడ్డి, శ్రీనివాస రాజు, రవి, న్యూచిట్యాల సర్పంచ్ నరసింహానాయక్, గృహ సారథులు పాల్గొన్నారు.



మాచాయపాలెంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ పద్మావెంకటేశ్వరరెడ్డి, నాయకులు

మంచినీటిని కాచి చల్లార్చి వినియోగించండి

సత్తెనపల్లి: పట్టణంలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న మంచినీటిని కాచి, చల్లార్చి, వడగట్టి వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం తెలిపారు. పురపాలక సంఘానికి చెందిన మంచినీటి నిల్వ చెరువులో నీటిమట్టం రోజు రోజుకు తగ్గు ముఖం పడుతున్నందున కుళాయిల ద్వారా సరఫరా చేయుచున్న మంచినీరు కొంత రంగు మారడం జరుగుతుందన్నారు. నాగార్జునసాగర్ కాలువల ద్వారా మంచినీటి చెరువులకు నీరు విడుదల చేసే వరకు పట్టణ ప్రజలు పురపాలక సంఘానికి సహకరించాలని ఆయన కోరారు.

షాదీఖానా పరిశీలన

క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న షాదీఖానును ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం పరిశీలించారు. డీఎంఎఫ్ గ్రాంట్ రూ.35 లక్షల నిధులతో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 15 ముస్లిం షాదీఖానాల(కమ్యూనిటీ భవనాలు)నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్లు తెలియజేశారు. పెదకూరపాడు మండలంలో 3, క్రోసూరు మండలంలో 6, అచ్చంపేటలో 1, అమరావతిలో 4, బెల్లంకొండ మండలంలో 1 నిర్మించేందుకు నిధులు మంజూరు చేసామన్నారు. వీటిలో క్రోసూరు మండలంలోని హసనాబాద్, పీసపాడు, గుడిపాడు గ్రామాల్లో నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల సంక్షేమం కొరకు అన్ని విధాలుగా సహకరిస్తున్నారని అన్నారు. అన్ని సౌకర్యాలతో నిర్మిస్తున్న ముస్లిం షాదీఖానాలు పేద ముస్లింలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, క్రోసూరు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, ఎంపీపీ పి.కోటయ్య, క్రోసూరు టౌన్‌పార్టీ అధ్యక్షుడు షేక్ ఖాదర్, పాశం శ్రీనివాసరెడ్డి, అడితి ముస్తఫా, బయ్యవరపు మస్తాన్‌రావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ గార్లపాటి దాసు, నాయకులు పాల్గొన్నారు.



షాదీఖానా నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు